క్లుప్తంగా

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



చైర్మన్ గిరిబాబుకు ఫిర్యాదు చేస్తున్న తిలక్‌నగర్ వాసులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు తిలక్‌నగర్‌లో అనుమతి లేకుండా నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబుకు ఫిర్యాదు చేశారు. పదిహేను అడుగుల వెడల్పులో ఐదు అంతస్తులు నిర్మించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు వైశ్యరాజు మోహనరాజు, గుంట అప్పారావు, కొత్తకోట జనార్దన, శ్రీనివాసరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు మెప్మా ఉద్యోగుల సాయం



ఎమ్మెల్యే శిరీషకు చెక్ అందిస్తున్న మెప్మా సిబ్బంది

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న మెప్మా ఉద్యోగులు విజయవాడ వరద బాధితులకు తమ వంతు సాయాన్ని అందించారు. పలాసలో శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి రూ.1,15,000 చెక్‌ను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పలాస–కాశీబుగ్గ మెప్మా సీఎంఎం పిన్నింటి మోహనరెడ్డి, జీఓ బాలరాజు, డీఈఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి సాయం



సాయం అందజేస్తున్న సమితి ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: పలాస– కాశీబుగ్గ పట్టణంలో నివాసముంటున్న నిరుపేద మద్ది కాంతమ్మ క్యాన్సర్‌తో బాధపడుతూ విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి సభ్యులు శుక్రవారం రూ.11వేలు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు చింత మురళి, జి.సునీల్, ఎ.లక్ష్మణరావు, బి.విఘ్నేష్, ఎస్.లోకేశ్వరరావు, రావి పంతులు, ఎం. సోమేష్, జి.పుష్పలత, జామి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



సామగ్రి అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

టెక్కలి మండలం పాత నౌపడలో తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదార్యం కనబరిచారు. సుమారు రూ.25 వేలు విలువైన చైర్, కంప్యూటర్ స్కానర్, ప్రింటర్ తదితర వస్తువులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారావు, పూర్వ విద్యార్థులు రాయల శంకరరావు, శ్రీరాములు, కిషోర్, ఆర్.రమేష్, బి.విద్యావతి, బి.లత, శ్రీనివాసరావు, ఢిల్లేశ్వరి, రాజేశ్వరి, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ బి.వి.రమణ

వజ్రపుకొత్తూరు: భారత రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని మండల విద్యాశాఖ అధికారి బి.వి.రమణ అన్నారు. శుక్రవారం వజ్రపుకొత్తూరు, నగరంపల్లి ఉన్నత పాఠశాలల్లో రాజ్యాంగంలోని వివిధ అంశాలపై లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా, కేశవరావులు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, విధులు, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రూ.1.90 లక్షలు టోకరా

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి కొందరు టోకరా వేశారు. డ్రగ్ కేసులో ఇరుక్కున్న కొడుకును రక్షిస్తానని చెప్పడంతో రూ.1.90 లక్షలు అప్పగించి మోసపోయారు. కాశీబుగ్గ సీఐ మోహనరావు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలిపూజకు సర్వం సిద్ధం

- గ్రామాలకు తరలిన గణనాథులు
- పూజా సామగ్రి కొనుగోలుతో రద్దీగా మార్కెట్లు



టెక్కలి: వినాయక చవితికి సిద్ధమైన మండపం



కాశీబుగ్గ: బస్టాండ్‌లో రద్దీగా మారిన ఉద్దాన మార్కెట్



వజ్రపుకొత్తూరు రూరల్:వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న కొండవూరు గణేష్ సంఘ సభ్యులు

టెక్కలి/కాశీబుగ్గ/వజ్రపుకొత్తూరు రూరల్/ఇచ్ఛాపురం: హిందువుల తొలి పూజ వినాయక చవితికి సర్వం సిద్ధమైంది. శనివారం వినాయకచవితి పర్వదినం సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో టెక్కలి, పలాస, కాశీబుగ్గ, పూండి, ఇచ్ఛాపురం తదితర పట్టణాల్లో మార్కెట్లు శుక్రవారం రద్దీగా మారాయి. గణనాథుని విగ్రహాలను గ్రామాలకు తరలించేందుకు యువత పోటీపడ్డారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పెద్ద ఎత్తున మండపాలను ఏర్పాటు చేశారు.



పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో దారిపొడవునా వినాయక విగ్రహాల అమ్మకాలు



ఇచ్ఛాపురం: వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న స్థానికులు

మట్టి ప్రతిమలనే పూజించాలి

కంచిలి/కాశీబుగ్గ/ఇచ్ఛాపురం: పర్యావరణానికి ఎటువంటి హాని తలపెట్టకుండా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కంచిలి పట్టణంలో కళింగకోమటి సంఘం ఆధ్వర్యంలో 2116 మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సోంపేట సీఐ బి.మంగరాజు, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీఓ వి.సీరజ, సర్పంచ్ లండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధు, వైస్ ప్రిన్సిపాల్ గణపతి, నర్సింహులు, ప్రసాద్, కోదండం, హేమాచలం, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 400 వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పైడిశెట్టి దినేష్, ప్రతినిధులు రామారావు, వేదవ్యాస్, వి.సురేష్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్



కాశీబుగ్గ: పలాస ఆర్టీసీ కాంప్లెక్సులో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి



ఇచ్ఛాపురం: మట్టివినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

చిట్టి చేతులు.. మట్టి గణపతులు



సోంపేటబేసిరామచంద్రాపురం ఉన్నత పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు



టెక్కలి: చాకిపల్లిలో మట్టి వినాయక ప్రతిమలతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు



సంతబొమ్మాళి: దండుగోపాలపురంలో మట్టి వినాయక విగ్రహాలతో విద్యార్థులు



సోంపేట: జింకిభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వినాయక విగ్రహం



కవిటి: లొట్టిపుట్టుగలో ఇంటింటికి మట్టిగణనాథులను పంపిణీచేస్తున్న విద్యార్థులు



కవిటి: కవిటిలో వంద విగ్రహాల్ని సిద్ధం చేసిన ప్రభుత్వ పాఠశాల చిన్నారులు

సోంపేట/టెక్కలి/సంతబొమ్మాళి/కవిటి: మట్టి గణపతి ప్రతిమలనే పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని జింకిభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వేణుగోపాలరావు, బేసిరామచంద్రాపురం ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ దుద్ది రాము కోరారు. విద్యార్థులు మట్టి వినాయ విగ్రహాలు తయారు చేసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులంతా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసి.. 'మట్టి వినాయకుడి ప్రతిమలను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అంటూ నినాదాలు చేశారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 68 మట్టి విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.చైతన్య, ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, రవికుమార్, విజయలక్ష్మి, మార్కండేయులు, కృష్ణవేణి, రోజా, యమున పాల్గొన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లొట్టిపుట్టుగ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులు తాము చేసిన మట్టిప్రతిమల్ని వీధుల్లో ఊరేగించారు. పర్యావరణహిత గణనాథులతో పూజలు చేయాలని పిలుపునిచ్చారు. పలువురికి విగ్రహాలను పంపిణీ చేశారు.

ఉత్సవాల నిర్వహణలో జాగ్రత్తలు తప్పనిసరి



అధికారులతో సమీక్షిస్తున్న టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓ సుదర్శన్ దొర

టెక్కలి: వినాయక చవితి సందర్భంగా పట్టణ, గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలని టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓ కె.సుదర్శన్ దొర అన్నారు. ఉత్సవాల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలు అనుమతుల మేరకే ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఉత్సవాలు పూర్తయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో తహసీల్దారు దిలీప్‌చక్రవర్తి, డీఎల్‌డీఓ అలివేలు, ఎంపీడీఓ లక్ష్మీబాయి, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరిస్తాం



పాఠశాల ఆవరణలో మురుగునీటిని పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాలలో నిల్వ ఉన్న మురుగునీటి సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరిస్తామని ఎంపీడీఓ బి.వెంకటరమణ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ సోంపేట పంచాయతీ ఈఓ శాంతికుమారికి ఆదేశించారు. పాఠశాల ప్రిన్సిపల్ చిన్నాజీ వర్మ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కమల వికాస్, ఈవోపీఆర్‌డీ వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల నిరసన



నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

టెక్కలి రూరల్: తమకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిలోని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు నిరసన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్‌నర్సులుగా నియమించుకోవచ్చునని తెలుపుతూ ప్రభుత్వం ఈ నెల 4న విడుదల చేసిన జీవోను రద్దు చేయాలని కోరారు. పదమూడేళ్లుగా, కరోనా వంటి కష్టకాలంలోనూ ఇంటిని, పిల్లలను వదిలేసి తమ వంతు సేవలు అందించామని, స్టాఫ్‌నర్సుల ట్రైనింగ్ సైతం పూర్తి చేసిన తమను కాకుండా ఏఎన్ఎంలకు ప్రాధాన్యమివ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. టెక్కలి జిల్లా ఆసుపత్రిలో సుమారు 35మంది కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు ఉన్నారని, అందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు ప్రసన్నకుమారి, మాధురి, ఈశ్వరమ్మ, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిస్తేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న లజపతిరాయ్

కాశీబుగ్గ: విద్యార్థులు మానవతా విలువలు పాటిస్తూ సన్మార్గంలో నడవాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. శుక్రవారం పలాస మండలం ఆర్‌కేపురం సత్యసాయి విద్యావిహార్‌లో ఆయన ప్రసంగిస్తూ మహాత్మా గాంధీ, అంబేడ్కర్ లాంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ఇద్దరు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ప్రకటించారు.

స్పీడ్ సినిమా సందడి

టెక్కలి: టెక్కలి భవానీ థియేటర్ వద్ద శుక్రవారం 'స్పీడ్ 220' సినిమా సందడి నెలకొంది. టెక్కలికి చెందిన కోళ్ల గణేష్ (చిన్నా) హీరోగా పరిచయం చేస్తూ తెరకెక్కిన ఈ సినిమా విడుదల కావడంతో కుటుంబ సభ్యులు, యువత సందడి చేశారు. థియేటర్ వద్ద కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

రాజ్యాంగాన్ని కించపరచడం తగదు

ఇచ్ఛాపురం: భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వేదవర బిసాయి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయమై సీఐ చిన్నంనాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లానని, రాజ్యాంగాన్ని అవమానించిన వారిని శిక్షించాలన్నారు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లపై క్షేత్ర పరిశీలన



జగతిలో క్షేత్ర పరిశీలన చేస్తున్న ఇంజినీర్ నేతాజీ

కవిటి: ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా రైతాంగానికి అందిస్తున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుపై మండల ఏపీ ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఇంజినీర్ ఎం.నేతాజీ శుక్రవారం క్షేత్ర పరిశీలన చేశారు. నూతన విధానంలో భాగంగా 1912 నంబర్‌కు కాల్‌చేసి వ్యవసాయ విద్యుత్‌కనెక్షన్ కావాలని దరఖాస్తు కోసం ఫోన్ చేస్తే అధికారులు వచ్చి నిర్ణీత మార్గదర్శకాల మేరకు తనిఖీ చేస్తారని చెప్పారు. ప్రాధాన్యతా క్రమంలో కనెక్షన్లు కేటాయింపు జరుగుతుందన్నారు.

రెండు కేజీల గంజాయి స్వాధీనం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 1వ వార్డు మొగిలిపాడు జాతీయ రహదారిపై రెండు కేజీల గంజాయితో ఓ యువకుడు గురువారం రాత్రి పట్టుబడ్డాడు. ఒడిశా నుంచి తీసుకుని వస్తుండగా స్వాధీనం చేసుకున్నామని, శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మోహనరావు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ధర్మపురం పంచాయతీలో దోమలు వ్యాప్తి చెందకుండా పంచాయతీ కార్యదర్శి పూడి స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఫాగింగ్ యంత్రంతో దోమల మందు పిచికారీ చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు కార్యదర్శి తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు



శివానంద్‌ను సత్కరిస్తున్న గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు



నిరంజన్ ఖడంగాను సన్మానిస్తున్న ఎంఈఓలు

టెక్కలి/కంచిలి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా పురస్కారం అందుకున్న టెక్కలి మండలం రాళ్లపేట ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు హెచ్.శివానంద్ ప్రకాశరావును శుక్రవారం ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ ఐ.రాములయ్య, గ్రామపెద్దలు పి.అప్పలరెడ్డి, పి.చిన్నయ్యరెడ్డి, డి.లోకేశ్వర్‌రెడ్డి, గౌడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి.చంద్రిక, రామకృష్ణ, శ్యామ్‌సుందర్, శ్రీరామ్మూర్తి, నగేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయురాలు ఎం.రాజ్యలక్ష్మిను సన్మానించారు. కంచిలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న నేపథ్యంలో శుక్రవారం ఎంఈఓలు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబు, ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, శంకరరావు, శిబరాం, హరికృష్ణ, ధర్మారావు, జగన్ పాల్గొన్నారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు



హరిశంకర్ థియేటర్‌లో ధరల పట్టికను పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ: సినిమా థియేటర్లలో తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ హెచ్చరించారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని హరిశంకర్, ఎస్‌వీ మ్యాక్స్, భాస్కరరామ థియేటర్లను శుక్రవారం తనిఖీ చేశారు. వాహనాలను మండుటెండలో విడిచి పెట్టి పార్కింగ్ ఫీజు ఎందుకు వసూలు చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ప్రతి తినుబండారంపై రూ.5 నుంచి రూ.10 అదనంగా ఎందుకు తీసుకుంటున్నారని మండిపడ్డారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట పలాస తహశీల్దార్ బి.సత్యం, ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.